మన చౌరాస్తా
www.chourasta.com
The Complete News way
chourasta
వార్తలు, ప్రకటనల కోసం ఈ నంబర్‌ను సంప్రదించండి.
8555 800 812
- ఎడిటర్, మన చౌరాస్తా
29.03.2024 | శుక్రవారం
e-Paper

# కడియం కావ్య బ్యాక్ స్టెప్



## బీఆర్ఎస్‌కు 'కడియం' షాక్..!

- ఎంపీగా పోటీ చేయలేనంటూ కావ్య లేఖ
- కాంగ్రెస్‌లోకి కడియం ఫ్యామిలీ?
- మారుతున్న రాజకీయ సమీకరణలు

ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలు రోజురోజుకూ రసవత్తరంగా మారుతున్నాయి. ప్రధాన పార్టీల్లోని నేతలు ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా బీఆర్ఎస్‌లో ఇది మరీ ఎక్కువగా ఉంది. మొన్న ఎంపీ పసునూరి దయాకర్, నిన్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ కారు దిగి వెళ్లిపోగా.. తాజాగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్య ఆ పార్టీ పెద్ద షాక్ ఇచ్చారు. గత కొన్ని రోజులుగా పార్టీ నాయకత్వంపై మీడియాలో వస్తున్న అవినీతి, భూకబ్జాలు, ఫోన్ ట్యాపింగ్ లాంటి వ్యవహారాలు, లిక్కర్ స్కాం వంటి విషయాలు పార్టీ ప్రతిష్టను దిగజార్చాయని ఈ టైంలో తాను ఎంపీగా పోటీ చేయలేనంటూ అధినేత కేసీఆర్‌కు లేఖ రాశారు. ఎన్నికలు సమీస్తున్న సమయంలో కావ్య ఈ నిర్ణయం తీసుకోవడం సంచలనంగా మారింది.

- మన చౌరాస్తా ప్రతినిధి, జనగామ




### కేసీఆర్‌కు కడియం 'హ్యాండ్'

కడియం కావ్యకు బీఆర్ఎస్ టికెట్ ప్రకటించాక ఉమ్మడి వరంగల్‌లో తన తండ్రి కడియం శ్రీహరితో కలిసి జోరుగా ప్రచారం నిర్వహించారు. అయితే ఇటీవల కావ్య మాజీ సీఎం కేసీఆర్‌ను కూడా కలిశారు. అయితే అదే టైమ్‌లో పార్టీలో ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితిపై ఆమె కేసీఆర్ వివరించినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో తాము పార్టీ మారుతున్నామనే సంగతి చెప్పారని ప్రచారం జరుగుతోంది. అయితే కావ్య తన తండ్రి శ్రీహరి సూచన ప్రకారమే రాజకీయాల్లో వచ్చిన విషయం అందరికీ తెలిసిందే. ఆమె ఏ నిర్ణయం తీసుకున్నా, ఎటు అడుగులు వేసినా ఆయన మార్గనిర్ధేశంలో జరుగుతుందని పలువురు పార్టీ లీడర్లు అంటున్నారు. ఇప్పుడు కూడా ఆయన సూచన మేరకే కడియం కావ్య ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. ఇక ఈ కీలక పరిణామాలు చూస్తుంటే తండ్రి, కూతురు ఇద్దరు కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం కూడా సాగుతోంది. ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్న కడియం శ్రీహరి, ఆయన కూతురు నేడు కాంగ్రెస్ కండువా కప్పుకొనే వస్తారని పార్టీ వర్గాలు అంటున్నాయి.

### టికెట్ ఎవరికి..?

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 17 ఎంపీ స్థానాలకు పోటీ చేసే 13 మందిని ప్రకటించింది. పెండింగ్‌లో పెటిన 4 నాలుగు స్థానాల్లో వరంగల్ ఒకటి. ఇక్కడ ఆశావహులు ఎక్కువగా ఉండడంతో అభ్యర్థి ఎంపిక కొలిక్కి రావడం లేదని తెలుస్తోంది. అయితే కడియం శ్రీహరికి కాంగ్రెస్ కండువా కప్పి ఎంపీగా బరిలో దిపాలని కాంగ్రెస్ పెద్దలు ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. కడియం ఇందుకు ఒకే అంటారా.. లేదా కడియం కావ్యనే పార్లమెంట్ అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించుకుంటారా అనేది సంశయంగా మారింది.





అంతా సమన్వయంతో
## పనిచేయాలి
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

2 లో



రాహుల్ గాంధీది
## త్యాగాల కుటుంబం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

3 లో



పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్
## గెలుపు ఖాయం
- డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

2 లో

# ఆయుధాలు అప్పగించండి

■ వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా



**వరంగల్, (మన చౌరాస్తా ప్రతినిధి) :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రభుత్వ అనుమతులు ఉన్న ఆయుధాలు (తుపాకులను) స్థానిక పోలీస్ స్టేషన్లలో అప్పగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో అదేశించారు. పార్లమెంట్ ఎన్నికల వేళ శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు తీసుకునే ముందస్తు చర్యల్లో భాగంగా ఆయుధాల చట్టాన్ని అనుసరించి వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రభుత్వ అనుమతులు ఉన్న తుపాకులను కలిగి ఉన్న వ్యక్తులు, ప్రైవైట్ సంస్థలు తమ వద్ద ఉన్న తుపాకులను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలన్నారు.ఈ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 201 అనుమతి ఉన్న తుపాకులు ఉన్నాయని, ఇందులో హనుమకొండజిల్లాలో 131, వరంగల్ జిల్లాలో 52, జనగామ జిల్లాలో 18 తుపాకులు ఉన్నాయని తెలిపారు. పోలీస్ స్టేషన్లో అందజేసిన ఆయుధాలను ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం తిరిగి అందజేస్తామని సీపీ తెలిపారు. అలాగే జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే భద్రతా సిబ్బంది, గార్డు డ్యూటీలో ఉన్న వారికి మినహాయింపు ఉంటుందని ఆయన వెల్లడించారు.

# రోడ్డు ప్రమాదంలో కేజీబీవీ టీచర్ మృతి



**నర్మెట, (మన చౌరాస్తా) :** రోడ్డు ప్రమాదంలో ఓ టీచర్ మృతి చెందిన ఘటన నర్మెట మండలం గుంటూరుపల్లె స్టేజీ వద్ద జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తరిగొప్పుల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సైన్స్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న అరుణ జ్యోతి ఎప్పటి లాగే గురువారం జనగామ నుంచి తన ద్విచక్ర వాహనంపై పాఠశాలకు బయలుదేరింది. నర్మెట మండలంలో గుంటూరుపల్లె స్టేజి వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# కళాశాలపై చర్యలు తీసుకోవాలి

**స్టేషన్‌ఘన్‌పూర్, (మన చౌరాస్తా):** మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం కాకతీయ యూనివర్సిటీ అధికారులను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యూజీసీ, కేయూ నియమ నిబంధనల ప్రకారం కాకుండా ఆక్రమంగా విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా మాట్లాడుతూ మెమోలు ఇవ్వను అని బెదిరిస్తున్నారని ధర్మభిక్షం అన్నారు. యూజీసీ యునివర్శిటీ నిబంధనలు తుంగలో తొక్కి చట్ట విరుద్ధంగా ఫీజుల దోపిడీ చేస్తున్నారని అన్నారు. విద్యార్థి తల్లిదండ్రులతో అగౌరవంగా మాట్లాడుతున్నారని వెంటనే యూనివర్సిటీ అధికారులు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం నూతన మండల కమిటీ ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు గా చరణ్ కార్యదర్శిగా హరీష్, ఉపాధ్యక్షులుగా రోహిత్, మహేందర్ సహాయ కార్యదర్శి గా శృతి, సంగీత రశ్మి, కమిటీ సభ్యులుగా శ్రీకాంత్ ప్రణయ్ ప్రవలిక సాగర్ విష్ణు లను ఎన్నుకున్నారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

■ జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా



**జనగామ, (మన చౌరాస్తా ప్రతినిధి) :** ఎన్నికల విధులను సంబంధిత నోడల్ అధికారులు సమన్వయంతో నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సంబంధిత నోడల్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓటర్లలో చైతన్యం కల్పించేందుకు స్వీప్ కార్యక్రమాలు చేపట్టి, పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ ఫ్లెక్సీలతో ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం జరిగిందని, మాక్ పార్లమెంట్ పోలింగ్ విధానాన్ని నిర్వహించి ఎన్నికలపై యువతకు అవగాహన పరుస్తున్నామన్నారు. మహిళల్లో చైతన్యం కొరకు రంగోలి, క్విజ్, 5 కే రన్ వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద ఒక వారం రోజుల్లో ఐదు ఎఫ్ఐఆర్‌లు బుక్ అయ్యాయని, తరిగొప్పుల వద్ద రూ.2 లక్షలు నగదు, జిల్లాలో రూ.10 లక్షల విలువగల లిక్కర్ సీజ్ చేయటం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు కంప్లైంట్ సెల్ ద్వారా 166 ఫిర్యాదులను స్వీకరించి 141 ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందన్నారు. ప్రజాప్రతినిధుల సమక్షంలోనే ఈవీఎంల క్లోజింగ్, ఓపెనింగ్లను చేపట్టాలని అధికారులకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవోలు కొమరయ్య, వెంకన్న, జడ్జీ సీఈవో అనిల్ కుమార్, జిల్లా, నియోజకవర్గ నోడల్ అధికారులు, తహసీల్దార్లు ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## అంకిత భావమే పదవికి వన్నె తెస్తుంది

**జనగామ, (మన చౌరాస్తా) :** విధుల్లో అంకితభావంతో పనిచేసే అధికారుల వల్ల ఆ పదవికి వన్నె వస్తుందని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. ప్రభుత్వ అధికారులుగా ఉత్తమ సేవలు అందించి పదవి విరమణ పొందుతున్న ముగ్గురు అధికారులు ముఖ్య ప్రణాళిక అధికారి ఇస్మాయిల్, జిల్లా పంచాయతీ అధికారి రంగాచారి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి శ్రీనివాస్‌ను కలెక్టర్, ఇతర అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ అధికారులుగా ఉత్తమ సేవలందించి ప్రజల మన్నలను పొందుతూ తోటి సహోద్యోగులకు మార్గదర్శకులుగా గుర్తింపు పొందడం మధురానుభూతి నిస్తాయన్నారు. పదవీ విరమణ ఉద్యోగానికే గాని మనసుకు కాదన్నారు. సమాజ సేవలో పాల్గొని తరించాలన్నారు. ప్రభుత్వం తరపున ఎటువంటి సహకారం కావాలన్నా నేరుగా కలవచ్చునన్నారు.




కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గెలుపు ఖాయం

■ డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి

**జనగామ, (మన చౌరాస్తా ) :** పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని జనగామ డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబించిన ప్రజావ్యతిరేక విధానాల మీద ప్రజాస్వామిక హక్కుల కోసం అనేక సందర్భాలలో పోరాటం చేసిన ఉద్యమకారుడు, కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం శ్రమించిన నాయకుడు చామాల కిరణ్ కుమార్ రెడ్డి పార్టీ అధిష్ఠానం గుర్తించి భువనగిరి టికెట్ ఇవ్వడం జరిగిందన్నారు. ఆయన విజయం కోసం కార్యకర్త అహర్నిశలు కృషి చేయాలని కోరారు. గురువారం పెద్దరాంచర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వల్లాల మల్లేశం, ఎల్లంల నుంచి జనగామ వీరేందర్ రెడ్డి, జనగామ కౌన్సిలర్ అరవింద్, గ్రామశాఖ అధ్యక్షుడు రహీం, వార్డ్ మెంబర్లు పల్లె వెంకటేష్, పల్లె సురేష్, బుర్ర రాజశేఖర్, గ్రామ ఉపాధ్యక్షులు కలకుంట్ల శ్యామ్ యూత్ అధ్యక్షుడు అర్జున్, జనగామ మండల ఎంపీటీసీ పోరం అధ్యక్షుడు బండ లక్ష్మి వెంకటేష్, కొంతం వెంకటేష్, బిర్రు మధు, అందే సత్యనారాయణ, సబ్బాని పరమేష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కొమ్మూరి పార్టీ కండువా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ పదేళ్ల అహంకారపూరితమైన ప్రభుత్వాన్ని కూలదోచిన కానీ ఇంకా బీఆర్ఎస్ లీడర్లకు సిగ్గు రావడం లేదన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, చెంచారపు బుచ్చిరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శివరాజ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కల్యాణి, మండల ఇంచార్జి లింగాల నర్సిరెడ్డి, సేవాదల్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మత్ మహేందర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, మేడ శ్రీనివాస్, జక్కుల వేణు యాదవ్, జనగామ ఉమాపతి రెడ్డి, బొట్ల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.





# కొమ్మూరిని కలిసిన సామల పరమేశ్వర్

**జనగామ, (మన చౌరాస్తా) :** కాంగ్రెస్ పార్టీ పద్మశాలి విభాగం జనగామ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన దేవరుప్పుల మండలం, కోలుకొండ గ్రామానికి చెందిన సామల పరమేశ్వర్ జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొమ్మూరి ఆయనకు శుభాకాంక్షలు తెలిపి, అభినందించారు. పార్టీ శ్రేయస్సు కోసం నిర్విరామంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వేముల బాలరాజు, దోర్నాల వెంకటేశ్వర్లు, కామిని శ్రీనివాసు, నల్ల సత్యనారాయణ, ఏల జనార్ధన్, పిట్టల సతీష్, గుమ్మడిల్లి సత్యనారాయణ, ఎనగందుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వారిది త్యాగాల కుటుంబం

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**ములుగు, జ్వాల :** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబం అని ప్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ములుగు పట్టణ కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ములుగు మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అటవీ హక్కుల చట్టం ఆహార భద్రత, ఉపాధి హామీ, సమాచార హక్కు, విద్య హక్కు చట్టాలు తీసుకు వచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ ని భారీ మెజార్టీ తో గెలిపించాలని ఆమె కోరారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, ములుగు మండల క్లస్టర్ ఇంచార్జీలు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## కార్యకర్తలకు అందుబాటులో ఉంటా..

**దేవరుప్పుల, (మన చౌరాస్తా) :** దేవరుప్పుల మండలం సింగరాజూపల్లి గ్రామంలో జరిగే గౌడ కులస్తులు ఆరాధ్య దైవం కంఠమహేశ్వరా స్వామి విగ్రహ ప్రతిష్ఠపణ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ పాల్గొన్నారు. ఆయన తిరుగు ప్రయాణంలో దేవరుప్పుల స్టేజ్ వద్ద బీఅర్ఎస్ పార్టీ కార్యకర్త ఏల సోమసుందర్, బుక్క రామయ్య ను చూసి తమ యోగ క్షేమాలు తెలుసుకున్నారు. సోమసుందర్ నివాసంలో తేనీటి విందు స్వీకరించి అక్కడే అన్న పార్టీ కార్యకర్తలతో మాట్లాడి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విజయం దిశగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అద్యక్షుడు తీగల దయాకర్, పల్లా సుందర్ రామిరెడ్డి,చింత రవి, బుక్క రామయ్య, మల్లేశం, యాదగిరి, అర్జున్ పాల్గొన్నారు.


కాల గర్భంలో కలిసిన చరిత్రకు సాక్షి భూతం..
మన చౌరాస్తా..

ఆటపాటలు, ఆందోళనల అడ్డా..
మన చౌరాస్తా..



మది గదిలో దాగిన జ్ఞాపకాల గమనం..
మన చౌరాస్తా..

ఆలిన్ వన్ కథనాలతో..
మీ ముందుకు వస్తోంది.
e-ఎడిషన్